క్లుప్తంగా

కుష్టు సర్వే పక్కాగా ఉండాలి



సర్వేను తనిఖీ చేస్తున్న డాక్టర్ సురేంద్రబాబు

పొదలకూరు : కుష్టు వ్యాధి బాధితుల గుర్తింపుపై నిర్వహిస్తున్న సర్వే పక్కాగా ఉండాలని జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేంద్రబాబు అన్నారు. నామమాత్రపు సర్వే చేస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని విరువూరు గ్రామంలో కుష్టు సర్వేను సురేంద్రబాబు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలోని అన్నిదేశాల కంటే భారత్‌లో 50 శాతం కుష్టు వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు తెలిపారు. ప్రతి ఇంటిని ఆశా కార్యకర్త సందర్శించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనుమానిత మచ్చలు ఉంటే వైద్యాధికారికి సమాచారం అందజేయాల్సిందిగా సూచించారు. అనుమానిత కేసుల సంఖ్యను నమోదు చేయాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ పారామెడికల్ అధికారి ఎం.మోహన్‌రావు, ఆరోగ్య పర్యవేక్షకులు నరసమ్మ తదితరులు ఉన్నారు.

ప్రణాళికబద్ధంగా భవన నిర్మాణాలు

- కమిషనర్ సూర్యతేజ



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో నూతన భవన నిర్మాణాలు ప్రణాళికబద్ధంగా జరిగేలా పర్యవేక్షించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో టౌన్ ప్లానింగ్ విభాగాధికారులు, సచివాలయ వార్డు ప్లానింగ్ కార్యదర్శులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ అనుమతుల కోసం యజమానులు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న అనంతరం సచివాలయ పరిధిలోని కార్యదర్శులు క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించి వివరాలను నమోదు చేయాలని సూచించారు. నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని పేర్కొన్నారు. ప్లాన్ మంజూరుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించకపోయినా.. ఇతర ప్రమాణాలను పాటించకపోయినా భవన యజమానికి వివరణ అందించి పూర్తి వివరాలతో తిరిగి దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. సిటీ ప్లానర్ దేవీకుమారి, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ దశయ్య, సూపరింటెండెంట్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ల పనుల పరిశీలన

నగరంలోని పలు ప్రాంతాల్లో అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ పనులను కమిషనర్ సూర్యతేజ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్న క్యాంటీన్ల పనులను ఆగస్టు 15 నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఇంజినీరింగ్ ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ సంజయ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ నేడు

నగరపాలక సంస్థ పరిధిలోని 54 డివిజన్లలో 46,963 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను గురువారం పంపిణీ చేసేలా చర్యలు చేపట్టామని కమిషనర్ సూర్యతేజ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని 166 వార్డు సచివాలయాల పరిధిలో గల లబ్ధిదారులకు దాదాపు రూ.20.06 కోట్లను వారి ఇళ్ల వద్దే వార్డు సచివాలయ కార్యదర్శుల ద్వారా అందించేలా చర్యలు చేపట్టామని వివరించారు. పర్యవేక్షణకు గానూ 27 మంది నోడల్ అధికారులను నియమించామని వెల్లడించారు. ఉదయం ఆరు నుంచే పంపిణీని ప్రారంభించి.. వివరాలను ప్రతి గంటకూ నగరపాలక సంస్థకు తెలియజేయాలని సూచించారు.

పీడీఎస్‌యూ కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న రాజశేఖర్

నెల్లూరు (టౌన్): రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్, వినోద్‌కుమార్ కోరారు. నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బుధవారం నిర్వహించిన పీడీఎస్‌యూ జిల్లా కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడారు. జీఓలు 84, 83, 117ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను కాపాడాలని కోరారు. సమావేశంలో కొన్ని తీర్మానాలు చేసి ఆమోదించారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం 17 మందితో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సునీల్, ప్రధాన కార్యదర్శిగా షారూఖ్, ఉపాధ్యక్షులుగా శ్రావణ్, ప్రసాద్, సహాయ కార్యదర్శులుగా చరణ్, ఆసిర్, కోశాధికారిగా వశీం తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

- వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం
- నిర్లక్ష్యం వహిస్తే పశువులు, గొర్రెల ప్రాణాలకే ముప్పు
- టీకాలు వేయించాలంటున్న పశువైద్యాధికారులు

రోగాల కాలం.. మూగజీవాలు భద్రం



పచ్చిక బయళ్లలో మేత మేస్తున్న పశువులు



మేత కోసం వెళ్తున్న గొర్రెల మంద

కొడవలూరు : వర్షాకాలం రావడంతో పశువులు, గొర్రెలు తదితర మూగజీవాలకు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. అందువల్ల రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధశాఖ అధికారులు సూచిస్తున్నారు. మూగజీవాలకు ముందుగానే వ్యాక్సిన్‌లు వేయించుకోవాలని, వ్యాధులను గుర్తించిన వెంటనే అందుబాటులో ఉన్న పశు వైద్యాధికారిని సంప్రదించి సరైన చికిత్స చేయించుకోవాలని చెబుతున్నారు. ప్రధానంగా ముందు జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని సూచిస్తున్నారు.

గొంతువాపు వ్యాధి

పశువులకు సోకే వ్యాధుల్లో గొంతువాపు ప్రమాదకరమైంది. దీనిని గురక వ్యాధి అని కూడా పిలుస్తారు. వర్షాకాలంలో పశువులకు సూక్ష్మజీవుల వల్ల ఈ వ్యాధి సంక్రమిస్తుంది. తొలకరి వర్షాలు పడిన సమయంలో కలుషితమైన నీరు, మేత ద్వారా పశువుల్లో రోగ నిరోధక శక్తి తగ్గడంతో ఈ వ్యాధి బారిన పడుతాయి. ఈ వ్యాధి సోకిన పశువులను మిగిలిన పశువులతో కలిపి ఉంచితే వాటికి కూడా వ్యాపిస్తుంది. ఒకేపాకలో మిగతా వాటితో ఉంచకుండా వేరుగా ఉంచాలి. వర్షాకాలంలో పశువులు వర్షాలకు తడవకుండా చూసుకోవాలి.

బ్లూటంగ్–పుట్ రాట్ వ్యాధి లక్షణాలు

గొర్రెలు, మేకల్లో బ్లూటంగ్ వ్యాధి సోకితే ఎక్కువగా జ్వరం, మూతి వాపు, నోటిలో పుండ్లు, ముక్కులో చీమిడి, కాళ్ల కుంటడం, ఒంట్లో నీరు చేరడం, మేత మేయకపోవడం, ఈసుకుపోవడం(అబార్షన్), 30 శాతం పశువులు మరణించడం వంటి లక్షణాలుంటాయి. వీటి నివారణకు సాయంత్ర సమయంలో గొర్రెల మందలో వేపాకు పొగ పెట్టుకొంటూ అప్పుడప్పుడు బ్లూటాక్స్, టక్కిల్ మందులు పిచికారీ చేస్తూ పొడి ప్రాంతాల్లో మేతకు వెళ్లాలి.

కాళ్ల పండ్లు వ్యాధి సోకితే..

జీవాలకు కాళ్ల పండ్లు వ్యాధి సోకితే కాలి గిట్టల మధ్య చీము చేరి దుర్వాసన వస్తుంది. అలాగే గొర్రెలు కుంటుకొంటూ నడుస్తాయి. ఈ లక్షణాలు కనిపిస్తున్నప్పుడు జీవాలను బురద ప్రాంతంలో మేప కూడదు. పొడి ప్రాంతంలోనే మేత వేసే విధంగా చూడాలని పశువైద్యులు సూచిస్తున్నారు.

నివారణ చర్యలు

జూన్, జూలై, ఆగస్టు నెలల్లో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. పౌష్టికాహారం అందించాలి. వ్యాధి సోకిన పశువులను మిగిలిన వాటి నుంచి వేరు చేయాలి. వాటి స్థావరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలి.

ప్రత్యేక పరిస్థితుల్లో చిటిక వ్యాధి

ఈ వ్యాధి మన జిల్లాలో ప్రత్యేక పరిస్థితుల్లో గొర్రెలకు వస్తుంది. వరి కోతలు పూర్తయ్యాక పెట్టిన గడ్డి పిలకలను మేయడం ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. గడ్డి పిలకలను గొర్రెలు పరిమితికి మించి తీసుకొని గాలి ఆడని పరిస్థితి నెలకొని 'ఎంటరో టాక్సీమియా' అనే బ్యాక్టీరియా ఉత్పత్తవడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. ఏడాది వయస్సు ఉండే గొర్రెల్లో ఈ వ్యాధి వస్తుంది. ఇది సోకిన గొర్రెలు నీరసించి కొద్దిసేపటికే గిలగిల కొట్టుకుని మరణిస్తాయి. ఈ వ్యాధి లక్షణాలు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో కన్పిస్తాయి. వర్షాలకు ముందే గొర్రెలకు ఈ వ్యాధి రాకుండా టీకాలు వేయాలి. వ్యాధి సోకిన గొర్రెలను మంద నుంచి వేరు చేయాలి.

అన్నింటికీ టీకాలు పూర్తి చేశాం



వర్షాకాలంలో వచ్చే బ్లూటంగ్, గొంతు వాపు వ్యాధి, వరి కోతలు పూర్తయ్యాక వచ్చే చిటిక వ్యాధులకు వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. ఆస్పత్రి పరిధిలోని మూగ జీవాలన్నింటికీ మే మాసంలోనే వ్యాక్సిన్ వేయడం పూర్తి చేశాం. కాళ్ల పుండ్లు వ్యాధికి మాత్రం ఎలాంటి వ్యాక్సిన్ అందుబాటులో లేదు. ముందు జాగ్రత్తల ద్వారానే ఈ వ్యాధిని నిర్మూలించుకోవాలి. బ్లూటంగ్ వ్యాధికి వ్యాక్సిన్ వేసినప్పటికీ అక్కడక్కడా వ్యాధి సంక్రమిస్తోంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోవడంతో వారు అమరావతి నుంచి ప్రత్యేక వైద్యుల బృందాన్ని పంపారు. వారు వ్యాక్సిన్ వేసినప్పటికీ వ్యాధికి గురై మరణించిన మూగ జీవాలను పోస్టుమార్టం చేసి ల్యాబ్‌కు తీసుకెళ్లారు. దీనిపై ప్రయోగాలు జరుగుతున్నాయి. త్వరలోనే స్పష్టత వస్తుంది.

– హర్షారెడ్డి, పశువైద్యాధికారి, కొడవలూరు

కామాక్షితాయికి సారె సమర్పణ



అమ్మవారికి సారె సమర్పించిన మహిళలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారికి వంద మంది మహిళలు బుధవారం సారె సమర్పించారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి సారె సమర్పించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా అమ్మవారికి తొమ్మిది రకాల పూలతో పూజలు చేశారు. నవధాన్యాలు, తామర గింజలు, యాలకలతో తయారు చేసిన మాలలతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఆలయ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఈఓ ఏవీఎస్‌రెడ్డి పర్యవేక్షించారు.

కాకాణి పరామర్శ



పద్మనాభరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కాకాణి

తోటపల్లిగూడూరు : మండలంలోని ఈదూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత రావూరు పద్మనాభరెడ్డి ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ టంగుటూరు పద్మనాభరెడ్డి, టంగుటూరు పెద్ద శ్రీనివాసులురెడ్డి, సురేష్‌రెడ్డి, గుండాల వంశీరెడ్డి, నెలవాయి గోపిరెడ్డి, ఎస్.రమేష్‌రెడ్డి, ఇనకళ్ల వేణు పాల్గొన్నారు.

సిద్ధయ్య మాస్టార్ అరుదుగా ఉంటారు

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సిద్ధయ్య మాస్టర్ జ్ఞాపికను స్వీకరిస్తున్న మాజీ మంత్రి కాకాణి

పొదలకూరు : సిద్ధయ్య లాంటి మాస్టార్లు అరుదుగా ఉంటారని, వృత్తినే దైవంగా భావించడంతో పాటు విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకునే వారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని టీచర్స్ కాలనీలో కాకాణికి విద్యాబుద్ధులు నేర్పిన సిద్ధయ్య మాస్టర్ దశదిన కర్మ సందర్భంగా బుధవారం సంతాప సభలో మాజీ మంత్రి పాల్గొని, మాట్లాడారు. సిద్ధయ్య మాస్టర్ లేనిలోటు పూడ్చలేనిదన్నారు. వ్యక్తిగతంగా తనకు ఆయనతో ఎంతో అనుబంధం ఉందని, తన ఎదుగుదలకు ఆయనే కారణమన్నారు. ఈ సందర్భంగా సిద్ధయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మాజీ మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

లెప్రసీ, టీబీలపై అప్రమత్తత అవసరం



కొడవలూరు : తలమంచిలో లెప్రసీ, టీబీలపై సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

కొడవలూరు : లెప్రసీ(కుష్టు), టీబీ(క్షయ)ల పట్ల ప్రతి ఒక్కరిలో అప్రమత్తత అవసరమని హెల్త్ అసిస్టెంట్ సుధాకర్ సూచించారు. కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ ఆదేశాల మేరకు మండలంలోని తలమంచిలో లెప్రసీ, టీబీలపై బుధవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ సర్వే నిమిత్తం వైద్య సిబ్బంది ఇంటి వద్దకు వచ్చినప్పుడు ఏమైనా స్పర్శలేని మచ్చలున్నా, ఎడతెరపి లేకుండా దగ్గు వస్తున్నా వారి దృష్టికి తీసుకురావాలన్నారు. అంతేకాకుండా ఆరోగ్యంపై ఎలాంటి సందేహాలు ఉన్నా వైద్య సిబ్బందికి తెలపాలని కోరారు. ఏ వ్యాధినైనా ప్రాథమిక దశలో గుర్తించడం వల్ల పూర్తిగా నయం చేసే వెసులుబాటు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం అనిత, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



కొడవలూరు : రిటైర్డ్ టీచర్ వివేకానందరెడ్డికి బహుమతి ఇస్తున్న హెచ్ఎం




పొదలకూరు : రిటైర్డ్ హెచ్ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొడవలూరు : మండలంలోని యల్లాయపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన చేడిమల వివేకానందరెడ్డికి ఆ పాఠశాలలో బుధవారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సహోపాధ్యాయులు, మిత్రులు, బంధువులు, విద్యార్థులు శాలువాలు, బహుమతులతో సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఎ.మోహన రామలింగయ్య మాట్లాడుతూ వివేకానందరెడ్డి 30 సంవత్సరాల పాటు ఎంతో నిబద్ధతతో పనిచేసి ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో వేణుంబాక సుధాకర్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, ఈట జార్జి, కట్టా ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయుడు ఎస్.తిరుమలయ్య, సీఆర్ఎంటీ ఎం.దయాకర్ పాల్గొన్నారు.

హెచ్ఎంకు..

పొదలకూరు : మండలంలోని కనుపర్తి పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన లక్కాకుల వెంకటసుబ్బారావును స్థానిక కల్యాణ మండపంలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయునిగా ఆయన చేసిన సేవలను ఎంఈఓ–1 రేణుకాదేవి, ఎంఈఓ–2 శోభనాద్రి కొనియాడారు. వెంకటాచలం, మనుబోలు, కలువాయి, పొదలకూరు మండలాల్లో సుబ్బారావు పనిచేసి గుర్తింపు తెచ్చుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ గౌరవాధ్యక్షుడు కె.రాధయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్.మాల్యాద్రి, నాయకులు ఎస్‌కే సుభాన్, మహ్మద్, కాంతారావు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను కమ్మేస్తున్న కంపకర్ర



కనుపర్తి–అల్లూరి లింకురోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపకర్ర చెట్లు

పొదలకూరు : గ్రామీణ ప్రాంతాల్లో రహదారులకు ఇరువైపులా కంపకర్ర కమ్మేస్తోంది. ఫలితంగా మలుపుల్లో ప్రమాదాలు సంభవిస్తున్నట్లు గ్రామీణ ప్రాంత ప్రజలు వెల్లడిస్తున్నారు. పీఎంజీఎస్‌వై, నాబార్డు తదితర నిధులతో మండలంలో దాదాపుగా అన్ని గ్రామాల్లో తారురోడ్ల నిర్మాణం చేపట్టారు. అయితే రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడం వల్ల వాహనచోదకులకు ఇబ్బందిగా మారుతోంది. ఎంజీఎన్నార్‌ఈజీఎస్ పథకంలో జంగిల్ క్లియరెన్స్ ఉన్నా ఎందుకనో అధికారులు చేపట్టడం లేదు. ఫలితంగా ఏపుగా పెరుగుతున్న కంపకర్ర చెట్ల వల్ల వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

3న మండల సర్వసభ్య సమావేశం

తోటపల్లిగూడూరు : ఈనెల 3వ తేదీన తోటపల్లిగూడూరు మండల సర్వసభ్య సమావేశం జరుగనున్నట్లు ఎంపీడీఓ కేఎస్ బాలాజీ తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ 3వ తేదీ 11 గంటలకు ఎంపీపీ ఉప్పల స్వర్ణలత అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఉంటుందన్నారు. అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఇతర అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

ఎస్ఎంసీ ఎన్నికలు ఆగస్ట్ 8న

ముత్తుకూరు : 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఆగస్టు 8వ తేదీన జరుగుతాయని ఎంఈఓ మధుసూదన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించి గురువారం నోటిఫికేషన్ జారీ చేస్తారని పేర్కొన్నారు. ఈ మేరకు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు.

నిర్మాణ భవనాన్ని వినియోగంలోకి తెస్తాం

సాక్షి ఎఫెక్ట్..

ముత్తుకూరు : అదనపు గదులకు మోక్షమెప్పుడో అనే శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన వార్తకు డీఈఓ రామారావు స్పందించారు. దీనిపై వివరణ ఇవ్వాలంటూ ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసులురెడ్డిని ఆదేశించారు. ఆయన వివరణ ఈ విధంగా ఉంది. నాబార్డు నిధులు రూ.1.92 కోట్లతో గత ప్రభుత్వంలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణం ఎన్నికల కోడ్ వల్ల నిలిచిపోయింది. కొత్త ప్రభుత్వం కూడా ఈ భవనాన్ని పూర్తి చేయాలని ఆదేశించింది. మరో రూ.2 లక్షలు వ్యయం చేసి, విద్యుత్ సౌకర్యం, మెట్లు, ర్యాంపు నిర్మాణం పూర్తి చేస్తే ఈ భవనం వినియోగంలోకి వస్తుందని వివరణలో పేర్కొన్నారు.

రేపట్నుంచి రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలు



జిల్లా క్రీడాకారులతో నిర్వాహకులు

ఇందుకూరుపేట : రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలు ఇందుకూరుపేట ఎంకేఆర్ క్రీడా మైదానంలో శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని పోటీల నిర్వాహక అధ్యక్షుడు పమజుల రవి, కార్యదర్శి దాసరి విజయ్‌కుమార్ తెలిపారు. ఈ క్రమంలో ఏర్పాట్లను వారు బుధవారం పరిశీలించారు. జిల్లా పురుషులు, మహిళల జట్లకు క్రీడా దుస్తులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పమజుల శ్రీనివాసులు, మహాలక్ష్మి స్మారక 11వ రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో దువ్వూరు కల్యాణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోటీలు జరుగుతాయన్నారు. అన్ని జిల్లాల పురుషులు, మహిళా క్రీడాకారులకు వేర్వేరుగా సదుపాయాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చెంచు కిశోర్‌బాబు, రమేష్‌నాయుడు, పవన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, గోపాల్, చంద్రమోహన్‌రెడ్డి, మధురెడ్డి, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ రమణబాబు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కమిషనర్ రమణబాబు అన్నారు. పట్టణంలోని బేల్దారిపాళెం, వాసవినగర్, షాదీమంజిల్, పాతచేపల మార్కెట్, పాత మున్సిపల్ భవనం తదితర ప్రాంతాల్లో బుధవారం కమిషనర్ పర్యటించారు. పారిశుద్ధ్య సిబ్బంది హాజరు, పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయా ప్రాంతాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశామన్నారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా ఎప్పటికప్పుడు నగరాన్ని శుభ్రంగా ఉంచేలా సిబ్బంది పని చేయాలని సూచించారు. ప్రజలు కూడా తడి, పొడి చెత్తలను వేర్వేరుగా అందించి సహకరించాలన్నారు. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని తెలిపారు. ఆయన వెంట నగర పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

నెల్లూరు(అర్బన్): బుజబుజనెల్లూరులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డీవైఎఫ్ఐ నేతలు కోరారు. ఈ మేరకు 2 / 25 వార్డు సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్రాన్ని బుధవారం అందజేసిన అనంతరం సంఘ నేత కొండా ప్రసాద్ మాట్లాడారు. ఇక్కడి పలు కాలనీల్లో కాలువల్లేక రోడ్లపై మురుగు ప్రవహిస్తోందని చెప్పారు. కాలువలను నిర్మించడంతో పాటు దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని కోరారు. డీవైఎఫ్ఐ రూరల్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, విజయకుమార్, ఫిరోజ్, రాఘవ, కరిముల్లా, పుల్లయ్య, తిరుపాల్, శాఖ కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వరిపైరులో ఎలుకల నివారణ కీలకం



నరుకూరు వరి పొలాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



కోవూరు : రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారులు

- ఏడీఏ రాజ్‌కుమార్

తోటపల్లిగూడూరు : వరిపైరులో ఎలుకల నివారణ ఎంతో కీలకమని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఇందుకూరుపేట డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు(ఏడీఏ) రాజ్‌కుమార్ సూచించారు. మండలంలోని నరుకూరు గ్రామంలో వరి పొలాలను వ్యవసాయాధికారులు బుధవారం సందర్శించారు. ఈ క్రమంలో స్థానిక పంట పొలాల్లో ఎలుకల వల్ల కొంత పంట నష్టం జరిగినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎలుకల నివారణపై రైతులు దృష్టి సారించాలన్నారు. ఎలుకల కదలికలను గుర్తించి వాటి నివారణకు బ్రోమోడైలిన్, జింక్ ఫాస్పైడ్‌ను వాడాలన్నారు. సుడిదోమ నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరిలో నత్రజని ఎరువుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శిరీషారాణి, గ్రామ వ్యవసాయ సహాయకులు నిరీష, కుసుమ, విద్యాసాగర్, కావేరి, శశి, అనూష, దయానా, పలువురు రైతులు పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

కోవూరు : వరిసాగు చేస్తున్న రైతులు తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ సుజాత అన్నారు. మండలంలోని గుమ్మలదిబ్బలో వరి పొలాలను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పైరు లేత దశలో ఉన్నప్పుడు వేప నూనె, వేప గింజల కషాయాన్ని పిచికారీ చేయాలన్నారు. దీనిద్వారా తల్లి పురుగు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చన్నారు. పొటాష్‌ను ఎకరానికి 35 కిలోల చొప్పున పిచికారీ చేయాలన్నారు. పొలాల్లో ఎలుకల నివారణ చేపట్టాలని సూచించారు. ఆమె వెంట ఏఓ ఇందిరావతి, సిబ్బంది మెహరున్నీసా, రాజశేఖర్, చైతన్య తదితరులు ఉన్నారు.